www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 24 నవంబర్ 2024

రుడా చైర్మన్‌గా నేడు వెంకటరమణ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కోరుకొండ

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్‌గా బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరునుంది. ఈ సందర్భంగా బూరుగుపూడిలోని టిడిపి రాజానగరం కార్యాలయం నుంచి రాజమహేంద్రవరం ప్రమాణ స్వీకార వేదిక వరకూ భారీ ర్యాలీ నిర్వహించడానికి టిడిపి నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ట్రాఫిక్ చలాన్‌లకు బ్రేక్

- కొత్త యాప్ ఎప్పుడొస్తుందో...
- యాప్ విడుదలపై స్పష్టత కరువు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ట్రాఫిక్ ఈ చలానాల ప్రక్రియ 6 నెలలుగా నిలిచిపోయింది. కొత్త యాప్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అప్పటి వరకూ ట్రాఫిక్ ఉల్లంఘనులకు కళ్లెం వేసేదెలా అనే ప్రశ్న పోలీసు శాఖలలో ట్రాఫిక్ విభాగంలో తలెత్తుతోంది. గత ప్రభుత్వం పాత యాప్ రద్దు చేసిన విషయం విదితమే. ట్రాఫిక్ ఈ చలానాలు వేసే యాప్ దుర్వినియోగం కావడం.. కోట్లాది రూపాయల కుంభకోణం జరగడంతో అప్పటి ప్రభుత్వం ఆ యాప్‌ను ఆపేసింది. ప్రత్యామ్నాయం చూడకుండా యాప్ నిలిపివేయడంతో ఈ చలానాల ద్వారా పోలీసుశాఖకు రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి పడింది. మరోవైపు ట్రాఫిక్ ఉల్లంఘనులు యథేచ్ఛగా వాహనాలను వినియోగించడంతో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు పరిపాటిగా మారాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంతో పాటు పట్టణ కేంద్రాల్లో ఈ ఏడాది ఆగస్టు వరకూ ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులు ప్రధాన వీధుల్లో ఉల్లంఘనులను గుర్తించి కేసులు రాస్తుండేవారు. ప్రస్తుతం యాప్ అందుబాటులో లేకపోవడంతో పోలీసులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి ఫొటోలను తీసి భద్రపరుస్తున్నారు. కొత్త యాప్ అందుబాటులోకి రాగానే అప్‌లోడ్ చేసి చలాన్లు విధించే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులకు విధించే అపరాధ రుసుం ద్వారా ఏడాదికి రూ.1.20 కోట్ల మేర ఆదాయం పోలీసు శాఖకు వస్తుంది. ఈ లెక్కన ఈ చలానా కింద గడిచిన 6 నెలల్లో దాదాపు రూ.50 లక్షల మేర ఆదాయం పోలీసు శాఖ కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో రాజమహేంద్రవరం వాణిజ్య కేంద్రం కావడంతో రోజు రోజుకీ పట్టణ జనాభా పెరుగుతోంది. అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి వివిధ వస్తువుల కొనుగోలు, విధుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య కూడా వేలల్లోనూ ఉంటుంది. ప్రస్తుత అవసరాల రీత్యా వాహన వినియోగం పరిపాటిగా మారింది. కావున ద్విచక్ర వాహనాలు, కార్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. మరోవైపు రహదారులు విస్తరించకుండా డివైడర్లు ఏర్పాటు చేయడం, కొన్నిసార్లు మైనర్లు సైతం వాహనాలను వినియోగించడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అదే విధంగా బస్ కాంప్లెక్స్, దానవాయిపేట, రైల్వే స్టేషన్ ఏరియా, దేవీచౌక్ తదితర ముఖ్య ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు, వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్యామలా సెంటర్‌లో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

గౌతమ్ అదానీని తక్షణం అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గౌతమ్ అదానీని తక్షణం అరెస్టు చేయాలని, ఆర్థిక నేరస్తుడు అదానీని కాపాడుతున్న మోడీ ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక శ్యామలా సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ అదానీకి కేటాయించిన భూములను, ప్రజల సంపదను వెనక్కి తీసుకోవాలని, లంచాలు తీసుకున్న అవినీతిపరుల పేర్లు, వివరాలను అమెరికా ప్రభుత్వం నుండి పొందడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా వెంటనే దౌత్యపరమైన చర్యలు చేపట్టాలి, అమెరికా న్యాయ స్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా అదానిపై కేసు నమోదు చేయాని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వెంటనే కేసు నమోదు చేసేటట్లు సిబిఐని ఆదేశించాలని డిమాండ్ చేశారు. అదానీ గ్రూపు అక్రమాలను వెలికితీసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలి కోరారు. అదానీతో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేసి, ప్రజలపై విద్యుత్ బారాలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు టిఎస్.ప్రకాష్, ఎస్ఎస్.మూర్తి, సావిత్రి, తాతారావు, రామకృష్ణ, ప్యారీ, వెంకట లక్ష్మి, రాంబాబు, రాజేష్, రమేష్, సుధ, భారతి, శ్రీనివాస్, కనక తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు సుందర్ బాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 108 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమేష్ బాబు మాట్లాడారు. 108ని నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, చనిపోయిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకుడు టికె.విశ్వేశ్వర రెడ్డి, సిపిఎం రాజమండ్రి సిటీ కార్యదర్శి బి.పవన్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, 108 ఉద్యోగ ప్రతినిధులు శ్రీమన్నారాయణ, వెంకటేశ్వరరావు, నాగరాజు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు భోజనం, ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో సాగిపాడు లెప్రసీ కాలనీలో శనివారం కుష్ఠి రోగులకు రూ.12,000తో నిత్యావసర వస్తువులు, భోజనాలు, ఆర్థిక సాయం అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రత్తిపాటి అబెడ్నెగో, చందు మాట్లాడుతూ దాతలు డాక్టర్ మూర్తి మంగన్న సర్జికల్ అండ్ మెటర్నటీ నర్సింగ్ హోమ్ రూ.6,000, పెనుమాక జ్యోత్స్న కుమార్తె మానస పుట్టినరోజు సందర్భంగా అందించిన రూ. 6,000తో సాయం అందించినట్లు తెలిపారు.

ఎంఎల్‌సి ఓటర్లుగా 53,624 మంది నమోదు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లుగా శనివారం నాటికి 51,624 మంది గ్రాడ్యుయేట్స్ దరఖాస్తు నమోదు చేసుకున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం డిఆర్ఒ సీతారామమూర్తి రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లుగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దరఖాస్తులు 51,624 వచ్చాయని తెలిపారు. ఇందులో పురుషులు 30,292 మంది, మహిళలు 21,328 మంది ఇతరులు 14 మంది ఉన్నారని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా డిసెంబర్ 9న ప్రకటించనున్నట్లు తెలిపారు. గతంలో ఎంఎల్‌సి ఎన్నికల నాటి కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తరపున కర్రి రామకృష్ణ, బిఎస్‌పి తరపున పులగల ప్రదీప్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విజెఎస్‌లో ఫార్మసీ ఉత్సవాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక దివాన్ చెరువు విజెఎస్ ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. థింక్ హెల్త్ అండ్ థింక్ ఫార్మసీ అనే అంశంపై వారం రోజులు కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు థింక్ హెల్త్ అండ్ థింక్ ఫార్మసీ అనే అంశంపై వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ మూడో వారంలో ప్రజారోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులు చేసే అమూల్యమైన సహకారాన్ని గుర్తిస్తూ ఈ నేషనల్ ఫార్మసీ వీక్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్‌విపి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణలో ఫార్మసీరంగం ఎంతో కీలకమైనదని తెలిపారు. కళాశాల చైర్‌పర్సన్ ఎన్.శకుంతల విద్యార్థులను అభినందించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీలు, ఫార్మా ట్రెజర్ హంట్, పాటల పోటీలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. ఏడో రోజు శనివారం విజెఎస్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు దివాన్‌చెరువులో ఫార్మసీ రంగంపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

కార్టూ'నిజం'



ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

డిసెంబర్ 5న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారలను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఎల్‌సి ఎన్నికలప్రక్రియకు సంబంధించి పలు శాఖల అధికారులు, ఎస్‌పి డి.నర్సింహకిషోర్ , జెసి చిన్న రాముడు, సహాయ ఎన్నికల అధికారి, డిఆర్ఒ టి.సీతారామమూర్తితో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం అయిదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొత్తం 2,894 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 21 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలు, 20 ఎఫ్ఎస్‌టి బృందాలు, 6 ఎస్ఎస్‌టి బృందాలను నియమించామన్నారు. అన్ని సెక్టోరల్ రూట్ అధికారులు ముందుగానే వారికి కేటాయించిన మండలాల్లో రూట్‌లను పరిశీలించుకోవాలన్నారు. వనరులబుల్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌కు ముందురోజు పోలింగ్ మెటీరియల్ ఆర్ట్స్ కళాశాలలో పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటికే పిఒలు, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అనుభవం కలిగిన వారిని ఎన్నికల విధుల్లో నియమించినట్టు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలను కల్పించామని, తాగునీరు, విద్యుత్, షామియానాలు, ర్యాంపులు, టాయిలెట్స్, టెలిఫోన్, తదితర వసతులను కల్పించామన్నారు. ఎస్‌పి డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 5న నిర్వహించనున్న ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 20 రూట్లలో, పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రంలో, రిసెప్షన్ సెంటర్‌లో ప్రవేశ ద్వారం, బయటికి వెళ్లే మార్గంలో పోలీస్ భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారి ఎం.మాధురి, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డిఎస్‌పిలు టివి.కుమార్, కె.రమేష్ బాబు, డిటిఒ ఎన్.సత్యనారాయణ, ఆర్‌టిఒ ఆర్.సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కోరుకొండ

సహాయ నిధి పత్రాలను అందిస్తున్న ఎంఎల్ఎ బత్తుల

పేద ప్రజల ఆరోగ్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతోందని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సుమారు రూ.30 లక్షల చెక్కులను కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ఎంఎల్ఎ బలరామకృష్ణ శనివారం అందజేసారు. రాజానగరం మండలం వెలుగుబంద గ్రామానికి చెందిన బొర్రా వీరబాబుకు రూ.47 వేలు, రాధేయపాలెం గ్రామానికి చెందిన పెనిమిరెడ్డి లిఖితా శ్రీదేవికి రూ.60 వేలు, కలవచర్లకు చెందిన పిల్లా అప్పారావుకి రూ.35 వేలు, జి.యర్రంపాలెనికి చెందిన నేతి అనితకు రూ.93 వేలు, దివాన్‌చెరువు గ్రామానికి చెందిన ముప్పనపల్లి బ్రహ్మయ్యకు రూ.22 వేలు, తోకాడ గ్రామానికి చెందిన నల్లమిల్లి చినసత్యనారాయణకు రూ.43 వేలు, కోరుకొండ గ్రామానికి చెందిన ఉప్పలపాటి సత్యనారాయణకు రూ.లక్షా 50 వేలు, ముసమల్ల సతీష్ కుమార్‌కు రూ.70 వేలు, కాపవరం గ్రామానికి చెందిన ఆకుల నరసాయమ్మకు రూ.25 వేలు, మునగాల గ్రామానికి చెందిన చెన్నా నాగదేవికి రూ.25 వేలు, గాదరాడ గ్రామానికి చెందిన జెట్టి పావనికి రూ.40 వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేసారు.

అనాథలు, నిరాశ్రయులకు స్వర్ణాంధ్ర సేవలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

నగరంలో అనాథలు, వృద్ధులు, నిరాశ్రయుల కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ విశేష సేవలు అందిస్తోందదిన జిల్లా అదనపు ఎస్‌పి అడ్మిన్ ఎన్‌బిఎం మురళీకృష్ణ ప్రశంసించారు. శనివారం మధ్యాహ్నం స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ అన్నదాన సేవా కార్యక్రమంలో మురళీకష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొబైల్ అన్నదాన సేవలు 1500 రోజులుగా చేస్తున్న స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు సేవా నిరతిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఒండున్నర దశాబ్దాల నుండి స్వర్ణాంధ్ర సేవా సంస్థతో తనకు అనుబంధం ఉందని ఎలాంటి ప్రభుత్వ నిధులు లేకుండా నగరంలో స్వచ్ఛంద దాతలు సహకారంతో స్వర్ణాంధ్ర సేవలు నిర్వహించడానికి సహకరిస్తున్న అందరూ అభినంద నీయులన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ అన్నార్తుల ఆకలి తీర్చడానికి 2020లో ప్రారంభించిన మొబైల్ అన్నదాన సేవలో నిరంతరంగా కొనసాగడానికి సహకరిస్తున్న దాతలకు సిబ్బందికి స్వీకరిస్తున్న లబ్ధిదారులకు కతజ్ఞతలు తెలిపారు. స్వర్ణాంధ్ర సేవలో నిత్యం పనిచేస్తున్న సిబ్బందిని రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి, కొండలరావు, తేతలి రామచంద్రరెడ్డి స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, సిబ్బంది కొండలరావు, ప్రసాద్ మీరా కుమారి, దివ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న మురళీకృష్ణ, స్వర్ణాంధ్ర రాంబాబు

హెల్త్ అవేర్నెస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం హుకుంపేట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె అధ్యక్షత వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె సుభాషిణీ దేవి విద్యార్థులకు ఆరోగ్య నియమాలను గురించి వివరించారు. సచివాలంలోని సిబ్బంది, గ్రామస్తులతో ఎపిఎస్ఎసిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్.పువనేశ్వరణ్, అశోక్ బాబు చర్చలు జరిపారు. వారి ఆరోగ్య సమస్యలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యమంలో జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం బివిఎన్ఎస్.మూర్తి, సచివాలయ సెక్రటరీ కె.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో 63వ ఫార్మసీ జాతీయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ పి కనకరాజు, సెక్రటరీ నాగమణి పాల్గొని ప్రారంభించారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి నుండి వచ్చిన డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ ఫార్మసీ అన్నది అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు ఉండే రంగమని తెలిపారు. తమతో సహకరిస్తున్న ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 102 మంది రోగులు పాల్గొన్నారు. వచ్చిన వారికి వైద్య పరీక్షలో నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు, వైస్ ప్రిన్సిపాల్ సుజిని, కళాశాల కో ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, డాక్టర్ గణేష్, డాక్టర్ పవన్ భార్గవ్, డాక్టర్ అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కిషోరి వికాసం శిక్షకులకు శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఉన్నతాధికారులు

స్థానిక ప్రకాష్ నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాల్లో జిల్లా స్థాయి కిశోరి వికాశం శిక్షకులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి నరసింహా కిషోర్ ఇతర అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందు పరిచిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా పిల్లలకు తెలియ చేయాలన్నారు. ప్రభుత్వ మహిళా సాధికారత, మహిళల అభివృద్ధిపై అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. జాతీయస్థాయిలో నల్సా రూపొందించిన మార్గదర్శకాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలకు, పేదరికంలో ఉన్న మహిళలకు న్యాయపరంగా రాజ్యాంగం కల్పించిన హక్కులపై వారికి అవగాహన కల్పిస్తామన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలను అనుసరించి డిఎల్ఎస్ఎ కార్యక్రమాలు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. న్యాయంతో పాటు సంక్షేమ కార్యక్రమాలపై జిల్లాలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరికీ సమన్యాయం అందించేందుకు మండల స్థాయిలో పారా లీగల్ వాలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో యువతకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. భారత రాజ్యాంగంలోని హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలియజేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం పున ప్రారంభ కార్యక్రమం పునాది వేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కోసం వచ్చిన అధికారులందరూ ఆడపిల్లల, సమాజ సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమం యుక్తవయస్సులో ఉన్న బాలికల సమగ్ర అభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు ఉద్దేశించిన కార్యక్రమంగా కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో వరకట్న మరణాలు , చైల్డ్ మ్యారేజ్, గహ హింస వంటి సంఘటనలు పునరావతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఎదుర్కునే విధంగా మహిళలను చైతన్యవంతులుగా అవగాహన కల్పించాలన్నారు. యుక్త వయసులో ఉన్న కిషోర్ బాలికలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఉండేలా మానసికంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత పిల్లలను మంచి పౌరులుగా సమాజం పట్ల బాధ్యతగా పెంచే ప్రయత్నం చేసే విధానం పై నమ్మకం గురువులదే అన్నారు. జిల్లాలో ఆడపిల్లలు పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఐదుగురు టీచర్లును కూడా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. స్కూల్స్ లో పిల్లలు చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి ఎదుగుదల, అభివద్ధిని ప్రభావితం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యుక్తవయస్సులోని బాలికల శ్రేయస్సును సమగ్రంగా నిర్ధారిస్తూ ప్రాజెక్ట్ తీసుకున్న సమగ్ర విధానాన్ని ద్వారా చైతన్యం తీసుకువచ్చి ధైర్యాన్ని నింపాలన్నారు. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో బందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్‌లో ఎటువంటి క్రిమినల్ కేసులు వచ్చినా పోలీస్ శాఖ ఫార్వర్డ్ చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌పి డి.నరసింహా కిషోర్ మాట్లాడుతూ కిశోరి బాలికలు బాల్యం నుండి యుక్తవయస్సు వరకూ సమాజంలో వారి ఎదుగుదలకు ఎవరు నుండి మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమం పట్ల మంచి స్పందన కూడా వస్తుందన్నాసారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, ఐసిడిఎస్ పీడీ కె.విజయలక్ష్మి, డిఇఒ కె. వాసుదేవ రావు, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఒ డాక్టర్ ఎన్‌పి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాలతో జీవ వినాశనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆధ్యాత్మిక చింతన ద్వారా యుద్ధాలు నివారించ వచ్చని ఉండ్రాజవరం ఎంఎన్‌వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు అన్నారు. సోషల్ మీడియాలో మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది, జరుగుతోంది అంటూ ఇటీవల జరుగుతున్న ప్రచారం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు, స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా వేదికలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కోట రామ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు, ఎల్.దేవి, జి.వెంకటేశ్వరరావు, స్థానిక మహతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఐ.జగదీష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్

ఆయిల్ చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - అమలాపురం

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో ఓఎన్‌జిసి వెల్ నుంచి ఆయిల్ దొంగిలించి చేస్తున్న ఇద్దరు వ్యక్తులతోపాటు, దొంగిలించిన ఆయిల్‌ను విక్రయాలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ వివరాలను వెల్లడించారు. ఉప్పలగుప్తం మండలం గోవరంలో వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితులను ఉప్పలగుప్తం పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దొంగిలించిన వైట్ ఆయిల్ లీటరు రూ.50కు కొనుగోలు చేసి రూ.80 విక్రయిస్తున్నారని తెలిపారు. నిందితులు ఓఎన్‌జిసి వెల్స్ పైపులైను బిగించి దాని ద్వారా ప్లాస్టిక్ టిన్నులోకి వైట్ ఆయిల్ చోరీ చేస్తున్నారని అన్నారు. నిందితులు 5 నెలలుగా నెలకు 3 సార్లు వైట్ ఆయిల్‌ను దొంగిలిస్తున్నట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. చోరీ చేసే సమయంలో ఆయిల్ ప్రెజర్ కేసు నాట్ ఊడిపోయి పెద్ద శబ్దం రావడంతో నిందితులు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల నుంచి నెంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనం, 10 లీటర్ల వైట్ ఆయిల్, ఆయిల్ చౌర్యానికి వినియోగించిన ప్లాస్టిక్ డబ్బాలు, పైపులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేసిన అమలాపురం రూరల్ ఇన్‌ఛార్జ్ సిఐ పి.వీరబాబు, ఉప్పలగుప్తం ఎస్ఐ సిహెచ్.రాజేష్, సిబ్బందిని జిల్లా ఎస్‌పి కృష్ణారావు ప్రత్యేకంగా అందించారని డిఎస్‌పి తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యువతి అదృశ్యంపై శుక్రవారం గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి గుండు శ్రీనివాసరావు కుమార్తె చైతన్య దుర్గ కాంపిటీషన్ ఎగ్జామ్స్ నిమిత్తం కొంతకాలంగా హైదరాబాదులో ఒక కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందు తోంది. ఈ నేపథ్యంలో అదే కోచింగ్ సెంటర్‌లో గల ఒక అబ్బాయితో చైతన్య దుర్గ సన్నిహితంగా ఉంటోంది. విషయం తెలుసుకున్న తండ్రి శ్రీనివాసరావు కుమార్తెను మందలించి ఇటీవల హైదరాబాదు నుంచి స్వగ్రామం తీసుకుని వచ్చాడు. అప్పటి నుంచి ఆ యువతి ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసరావు తోడల్లుడు అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 10న తన భార్య కుమార్తెను గొల్లప్రోలుకు పంపించాడు. బంధువులు ఇంటి వద్ద మూడు రోజులు పాటు ఉన్న చైతన్య దుర్గ ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయింది. ఉదయం చూసేసరికి చైతన్య దుర్గ కనిపించలేదు. కుమార్తె కోసం బంధువులు తెలిసున్న వారి ఇంటి వద్ద వెతికినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు, 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేశామన్నారు. ఎర్రంపాలెం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవజేసిన 10 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి - పిఠాపురం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా విధించినట్లు సిఐ జి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రవ్ తనిఖీల్లో 23 మందిని అదుపులోకి తీసుకుని పిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విజయ రామేశ్వరి వారికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని అన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కోళ్ళు, మేకలు, సెల్ ఫోన్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...గోకవరం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మండలంలో దొంగతనాలకు పాల్పడుతుండగా తనకి వచ్చిన సమాచారం మేరకు రామవరం గ్రామ శివారున ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి సుమారు రూ.70 వేలు విలువైన 4 కోళ్లు, ఒక యునికార్న్ బండి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

150 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కోరంగి పంచాయతీ చిన బొడ్డు వెంకటాయపాలెంకు చెందిన పెసింగి వీరబాబును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 150 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నాగేంద్రకృష్ణ, హెచ్‌సి వెంకటేశ్వరరావు, పిసి విష్ణు పాల్గొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రానికి చెందిన అమల్ కృష్ణ, మహమ్మద్ సాహుల్, సాహిల్ మొన్, అభినవ్ పునతిల్, రెండు మోటార్ సైకిళ్లపై మూడు బ్యాగ్‌లలో తరలిస్తున్న 40.550 కేజీల గంజాయి, బైకులను స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని సిఐ బి.నాగేశ్వర్ నాయక్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్తీక మాసం చివరిలోనూ కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. గత నెల రోజులుగా ధరలు ఆకాశాన్నంటుతూనే ఉన్నాయి. టమోటా కిలో రూ.50 చొప్పున, కిలో మిర్చి రూ.80 చొప్పున కొనుగోలుదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిక్కుడు కాయలు సైతం కిలో రూ.80 మార్కు దిగిరానంటున్నాయి. ఉల్లి ధరలు కేజీ రూ.70కి చేరాయి. టమోటా, ఉల్లిపాయలు ఈ రెండింటిలో ఏది ధర పెరిగినా వంట గదిలో రోజు గడవటం కష్టమే. అటువంటి ఈ ధరలు నెల రోజులుగా ఆకాశాన్నంటుతుండటంతో సామాన్యులకు కంటి మీద కునుకు కరువైంది. ఇక ఇతర కూరగాయలు సైతం కిలో రూ.50 పైమాటే. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలూ నింగిని తాకుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడిచింది. ధరల నియంత్రణకు చేపట్టిన చర్యలు శూన్యమని స్పష్టమవుతోంది. మరోవైపు పప్పుల ధరలు నింగిని తాకుతున్నాయి. నూనెల ధరలు పోటీపడుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది..

ప్రహసనంలా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారింది. ప్రతి సీజన్‌లోనూ పాలనా యంత్రాంగం చిత్తశుద్ధి లోపం రైతులను నట్టేట ముంచుతోంది. ఈ ఏడాదీ నత్తనడకన కొనుగోలు జరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పటి వరకూ 45 శాతం కోతలు పూర్తయినా ప్రభుత్వ కొనుగోలు లక్ష్యానికి పొంతనే లేదు. మరోవైపు మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా గాలిలో తేమ శాతం పెరిగింది. దీంతో ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలలో తేమ శాతం నిబంధనలు ప్రధాన అడ్డంకిగా మారినట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 75 కేజీల బస్తాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1630 కాగా రూ.1300 నుంచి రూ.1500 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు అధికంగా ఉన్నప్పటికీ రైతులకు మద్దతు ధర లభించడం లేదు.

చలి పులి

రోజు రోజుకి చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుంచి 22 డిగ్రీల సెల్సియస్ మధ్యలో నమోదవుతోంది. 15 రోజుల క్రితం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల వరకు ఉండగా, వారం రోజుల్లో గణనీయంగా పడిపోయాయి. మరో వైపు ఉదయం వేళల్లో పొగ మంచు కమ్మేస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా నవంబరు మొదటి వారం నుంచే చలి పెరుగుతుంది. గడిచిన నెల రోజులుగా క్రమక్రమంగా చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వర పీడితుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంటంతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

పోరుబాటలో ఉద్యోగ, కార్మిక వర్గాలు

తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఉద్యోగులు, కార్మికులు పోరుబాట పట్టారు. 108 ఉద్యోగులు ఈ నెల 25నుంచి సమ్మెలోకి వెళ్లామని స్పష్టం చేసిన విషయం విదితమే. ప్రభుత్వ నిర్లక్ష్యం సామాన్యులకు వైద్య సేవలు దూరం కానున్నాయి. అదే విధంగా ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లు దద్దరిల్లాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలు మరింత తీవ్ర రూపం దాల్చే పరిస్థితులు నెలకొన్నాయి.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ సుధీర్ రెడ్డి

ప్రజా పంపిణీ వ్యవస్థపై అవగాహన

ప్రజాశక్తి-పెరవలి

సహాయ పౌరసరఫరాల అధికారి ఎం.నాగ ఆంజనేయులు, డిటి శ్రీనివాస సుధీర్ రెడ్డి శనివారం ముక్కామలలో రేషన్ బియ్యం పోషకాలు, ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. అనంతరం అధికారి ఎం.నాగ ఆంజ నేయులు మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందించే బియ్యం ఎంతో బలవర్ధకమైనవని తెలిపారు. వీటిలో కెర్నల్స్ కలపటం వల్ల ఎన్నో పోషక పదార్థాలు మిళితమై ఉంటాయని తెలిపారు. లబ్ధిదారులు అందరూ రేషన్ బియ్యం ఆవశ్యకతను తెలుసుకుని వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. ఎపిఎం రామకృష్ణ పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీల ఎన్నిక

పలు మండలాల్లో శనివారం యుటిఎఫ్ కార్యవర్గాలను ఎన్నికున్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెరవలి యుటిఎఫ్ మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ అధ్యక్షుడు వి.సూర్య భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి విప్పర్తి వెంకట నారాయణ మాట్లాడారు. ఎన్నికల అధికారిగా జిల్లా సహాధ్యక్షుడు ఇవ్వల రాంబాబు వ్యవహరించారు మండల ప్రధాన కార్యదర్శి విఎన్‌వి.సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ పివి.రాముడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తాళ్లపూడి యుటిఎఫ్ జిల్లా ఆడిటర్ మానపాటి రవి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్‌ను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రతి ఉద్యోయగీ కృషి చేయాలని అన్నారు. రవి నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

చాగల్లులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల అధికారిగా రాజమండ్రి జిల్లా కార్యదర్శి రవిబాబు, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి వ్యవహరించారు.

గోపాలపురం యుటిఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.శంకరుడు, జిల్లా కార్యదర్శి ఎం.మనోహర్ తెలిపారు. స్థానిక జేపి స్కూల్లో వారు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని వారు తెలిపారు.

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ బైకుల చోరీలు నివారించడానికి కొన్ని జాగ్రత్తలు సూచించారు. బైకులను నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టరాదన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు లేదా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామ శివారులో నివాసం ఉంటున్న వారు సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

అదానీ, జగన్‌లను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-కడియం

సౌర విద్యుత్ రంగంలో అక్రమాలకు పాల్పడినట్టు అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ విచారణలో నిర్ధారణ జరిగిన నేపథ్యంలో పారిశ్రామికవేత్త అదానీతో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని కాంగ్రెస్ రూరల్ కో ఆర్డినేటర్ తాడాల కొండరాజు డిమాండ్ చేసారు. మండలంలోని బుర్రిలంక గ్రామంలో ఆయన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ అవినీతి అమెరికా వరకు వ్యాపించిందని, అదానీ సంస్థలకు రాష్ట్రంలో విద్యుత్, సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ కాంట్రాక్టులతో పాటు కృష్ణపట్నం, గంగవరం, స్మార్ట్ మీటర్లు, జెన్ కో, విశాఖలో డేటా సెంటర్ వంటి కీలకమైన వేల కోట్లు ప్రాజెక్టులు అప్పగించారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టులు అప్పగించేందుకు ఆయన అదానీ సంస్థ నుంచి భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. అటువంటి ఆర్థిక నేరస్తులపై చర్యలు తీసుకోకపోతే ప్రధాని నరేంద్ర మోదీ కూడా వారికి మద్దతిస్తున్నట్టుగానే భావించాల్సి ఉంటుందన్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల్లో జగన్‌కు రూ.1750 కోట్లు ఇచ్చినట్టుగా ఎఫ్‌బిఐ తేల్చిందని, ఇప్పుడు జగన్ ఇంటర్నేషనల్ నేరస్తుడిగా మారారని అన్నారు. జగన్‌ను అరెస్టు చేయడంతో పాటు ఎఫ్‌బిఐ నిర్ధారించిన కేసులో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణమూర్తి, పేరిచర్ల సత్యనారాయణ రాజు, వులిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ టాయిలెట్స్ డే

ప్రజాశక్తి-చాగల్లు

వరల్డ్ టాయిలెట్స్ డే కార్యక్రమంలో శనివారం చిక్కాల గ్రామ సర్పంచ్ కోయమణి, గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ కాసిం సాహెబ్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్ కోయమణి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు అందరూ సహకరించాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు అందరూ నిర్మించుకోవాలని, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఓటు నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాల్లో అర్హులందరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని ఉండ్రాజవరం తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని వేలివెన్ను, కాల్దారి, దమ్మెన్ను గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద బిఎల్‌ఓలు ఓటు నమోదు చేస్తారని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ జనన ధ్రువీకరణ పత్రం సమర్పించి ఓటు నమోదు చేయించుకోవచ్చున్నారు. ప్రత్యేక ఓటు నమోదు కేంద్రం ఆదివారం కూడా కొనసాగుతుందని ఆయన చెప్పారు.

ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యాన ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - నల్లజర్ల

ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యాన శనివారం పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సింగరాజుపాలెం, కొండయగుంట కాలనీ గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఇందిరా ప్రియదర్శిని, అంగన్వాడీ కార్యకర్త రాజా రత్నకుమారి, ఆశాలు రత్నకుమారి, ప్రశాంతి, రమణ, ఎంఎల్‌హెచ్ పి.సాయినాథ్ పాల్గొన్నారు.

మల్లేశ్వరాలయంలో లక్ష బిళ్వార్చన

ప్రజాశక్తి-కడియం

కడియంలోని పురాణ ప్రాశస్త్యం కలిగిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో శనివారం లక్షబిళ్లార్చన పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, ఆధ్వర్యంలో అర్చకులు అప్పలి మల్లేశ్వరరావు నేతత్వంలో పూజలు నిర్వహించారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక శ్రీనివాస రామానుజం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు గొందేశి గణపతి రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుమారులు హరనాథ్ రెడ్డి, కోడలు మాధవీలత రూ.10,000 బహుమతులు అందచేశారు. మాధవి, హరనాథ్ దంపతులు మాట్లాడుతూ నవంబర్ 23న, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందచేస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సత్యవతి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

26న ఏలూరు కలెక్టరేట్ వద్ద మహా ధర్నా

ప్రజాశక్తి గోపాలపురం

నవంబర్ 26న ఏలూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దొండపూడి, రాజంపాలెం, సాగిపాడులో శనివారం ప్రదర్శన నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడారను. కుంజం రామారావు, సవలం రాంబాబు, ఎం.రాజారత్నం పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తక్షణమే తగ్గించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రోజు రోజుకీ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలో వెంకటనగరం, ధర్మవరం గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. వెంకటనగరానికి చెందిన ముప్పిడి అప్పలకొండ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆయనను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో కార్మికులు వలస పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ పాల్గొన్నారు.

వైసిపి నాయకుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం వైసిపి నాయకులు గంగుల బాబ్జి (45) ఇటీవల ఆకస్మికంగా ధుర్మరణం చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతిని భార్యకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అందరూ అండగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకటశివరామప్రసాద్, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్, మోర్త బీమాబాయి, నాయకులు కాశి లక్ష్మణస్వామి, పెయ్యల కొండబాబు, కోరుకొండ చంటి, బొంతు సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఆదిత్య' క్రికెట్ టీమ్ ఎంపిక

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం 2024-2025కి సంబంధించిన క్రికెట్ టీం ఎంపికైంది. శనివారం నిర్వహించిన సెలక్షన్స్‌ని డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఆల్ రౌండర్ క్యాటగిరీలు పరీక్షించి మేలైన ప్రదర్శన చేసిన వారిని ఎంపిక చేసినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డాక్టర్ ఎన్.రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సిలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి. సత్యనారాయణ , స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ త్రిపాఠి, ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ఫార్మసీకి విదేశాల్లో ఉద్యోగావకాశాలు

తాళ్లరేవు : ఫార్మసీ రంగానికి విదేశాల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జెఎన్‌టియుకె సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫె సర్ పిన్నమనేని ఉదయభాస్కర్ తెలి పారు. శనివారం కోరంగి ఫార్మసీ కళాశా లలో ఫార్మసీ వారోత్సవాల ముగిం పు కార్యక్రమం జరిగింది. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పి.కనక రాజు, డైరెక్టర్లు చిట్టూరి కలికిమూర్తి, పి.నాగమణి, ప్రిన్సిపల్ సువర్ణజ్యోతి, ఎఐ మాల పాల్గొన్నారు.

ఇండియా కూటమి విజయంపై సంబరాలు

ప్రత్తిపాడు : జార్ఖండ్‌లో ఇండియా కూటమి విజయంపై సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. శనివారం స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారాజు మాట్లాడుతూ జార్ఖండ్ లో సింద్రీ, నిరస నియోజకవర్గాల నుంచి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థులు భారీ మోజారిటీతో విజయం సాధించారని అన్నారు. ఈ ఎన్నికల్లో జార్ఖండ్ రాష్ట్ర ప్రజలు మతోన్మాద బిజెపికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో మానుకొండ లోవమ్మ, పిల్ల ప్రభుదాసు, నేతల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వికలాంగుల కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మానసిక వికలాంగ విద్యార్థుల కార్తీక వనసమారాధన ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. స్థానిక ఉమా మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న వికలాంగుల కేంద్రం విద్యార్థులు శనివారం జామకాయల తూము సెంటర్‌లో ఉన్న గ్రీన్ వాలీలో ఆటపాటలతో గడిపారు. చిన్నారులకు మ్యూజికల్ ఛైర్, లెమన్ అండ్ స్పూన్, డాన్స్, పరుగు పందాలు నిర్వహించినట్లు నిర్వాహకులు గోపాల్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులకు ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న బహుమతులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, సత్తిబాబు, సిబ్బంది స్టీఫెన్ పాల్గొన్నారు.

ఆదిత్యలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ సెక్యూరిటీ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐ వైఆర్‌కె.శ్రీనివాసరావు, ఎస్ఐ శివనాగు పాల్గొని రోడ్డు భద్రత నియమాలు, సైబర్ సెక్యూరిటీ, ఉమెన్ ఎంపవర్మెంట్‌పై వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, డీన్ ఐక్యూఎసి డాక్టర్ సంజీవ్‌రావు, డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ.3.86 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3.86 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,61,570, అన్నదాన విరాళాల ద్వారా రూ.72,748, కేశఖండన ద్వారా రూ.6,400, తులా భారం ద్వారా రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.45,180 వెరసి రూ.3,86,198 ఆదాయం లభించిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సేవలందించారు.

వనసమారాధనకు కుడుపూడి విరాళం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరగనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల కార్తీక వన సమారాధనకు ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు విజయవాడలో మంత్రి సుభాష్‌ను కలిసి శివన్నారాయణ మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శెట్టిబలిజలను అధిక స్థాయిలో సమీకరించి వన సమారాధన విజయవంతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)

ఇ.పి. నెం. 65/2017

ఓ.యస్. నెం. 305/2008

డి. హెచ్. ఆర్./పిటీషనరు/ వాది:
శ్రీమతి కొనిజేటి నాగమణి, భర్త: వెంకట సుబ్బారావు, స్త్రీ, గృహిణి, వయస్సు 62 సం॥లు, డోరు నెం. 7-1-8/1, గణపతి సెంటర్, నిడదవోలు (గ్రామము/ మండలము)

జె.డి.ఆర్‌లు/ రెస్పాండెంట్లు/ ప్రతివాదులు:
(1) గుంటూరు సామ్రాజ్యం (లేటు)
(2) గుంటూరు సత్యన్నారాయణరెడ్డి
(3) శ్రీనివాసుల రెడ్డి

To:
4వ జెడిఆర్: గుంటూరు తిరుమలరెడ్డి, తండ్రి: సత్యన్నారాయణరెడ్డి, పురుషుడు, ప్రైవేటు ఉద్యోగి, వయస్సు 46 సం॥లు, కుమ్మర్ల వీధి, నిడదవోలు (గ్రామము / మండలము)

పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో 4వ జెడిఆర్ కు శ్రీ కోర్టు మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపించిననూ 4వ జెడిఆర్ సేల్ నోటీసులు పంపించిననూ 4వ జెడిఆర్ సేల్ నోటీసులు తీసుకొని యుండలేదు. కాబట్టి పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో 4వ జెడిఆర్‌కు ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ పై కోర్టు వారి ఎదుట **ది. 06-12-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఇ.పి. పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

ఎస్.సుబ్బారావు
కొవ్వూరు, అడ్వకేటు, కొవ్వూరు
ది.16-11-24, సెల్: 9492917811

పత్రికా ప్రకటన
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

In the Court of the Senior Civil Judge, Ramachandrapuram

E.A. No. 77/2023 in EPSR No. 87/2023 in O.S. No. 117/2018

Between:
Yalamati Rama Rao ...Petitioner/ DHr
AND
Chitturi Seshavataram (died) & Others ...Respondents/ Proposed Parties/ JDrs

3rd Respondent/ Proposed Party:
Katturi Kumari, D/o. late Ramarao, age 40 years, Occ: House wife, C/o. Ch.Satyanarayana, D.No. 2-10/2, Kondapallivari Veedhi, R/o. Mandapeta, Mandapeta Mandal, Alamuru PJCJ.

పై నెంబర్ గ్రంథంలో పై Chitturi Seshavataram చనిపోగా అతని యొక్క ముఖ్య వారసులుగా చేరిపించమని పై వాది/ పిటీషనరు పై నెంబరు గ్రంథంలో పై వాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీపై E.A. 77/2023 ను దాఖలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలు జరుపుటకు ది.వి. 28-11-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరుపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.వి. 28-11-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** హాజరు అయ్యి మీ తరుపున ఆక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేని యెడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షము ఉత్తర్వులు చేయగలరు.

CHINTAPALLI SRINIVASA RAO, Advocate
రామచంద్రాపురం, Ramachandrapuram
తేది:23-11-2024, Cell: 95534 51503

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీ ముద్రకోళ శ్రీనివాస్**, తండ్రి ముద్రకోళ వెంకటేశ్వరరావు గార్కి పొన్నమండ గ్రామంలో గల డాక్యుమెంట్ నెంబర్ 1911/2020 శెటిల్‌మెంట్ డాక్యుమెంట్ పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నందు ఋణం తీసు కొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజనల్స్ రిజిస్టర్ దస్తావేజు నెంబర్ 1911/2020 (తేది.17-07-2020) ఈ రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్‌కు లింకు డాక్యుమెంట్‌గా ఉన్న 785/2003 (తేది.22-05-2003). ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం పొన్నమండ ఇంటి దగ్గర నుండి అమలాపురం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా పారీఖత్తు 785/2003 (తేది.22-05-2003). దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ పారీఖత్తు 785/2003 మరియు 1911/2020 యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్స్ సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపోజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజనల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైన వీటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎన్.రమేష్, అడ్వకేట్ & నోటరీ,
అమలాపురం. సెల్:8008027999

మహిళా సంఘాల్లో రూ.44 లక్షల అక్రమాలు

ప్రజాశక్తి-కడియం

కడియపులంక గ్రామానికి చెందిన విఒఎలు సుమారు రూ.50 లక్షల మేర అవకతవకలకు పాల్పడ్డారని గ్రామ ఇన్‌ఛార్జి సర్పంచ్ పాటంశెట్టి వెంకట రామారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా సంఘాల రుణాలు, వాటి చెల్లింపుల్లో అవకతవకలు జరుగుతున్నాయని పలువురు మహిళా సంఘాల సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి డిఆర్‌డిఎ పీడీ మూర్తిని కలిశామన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బాల్లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చొరవతో కలెక్టర్ ఆదేశాలతో డిఆర్‌డిఎ పీడీ కమిటీ వేసి విచారణ చేపట్టారన్నారని రాంజీ తెలిపారు. తమ గ్రామానికి చెందిన విఒఎ ఏచూరి లక్ష్మీప్రసన్న రూ.20 లక్షలు, మరో విఒఎ పోలిశెట్టి నాగవేణి రూ.24 లక్షల మేర అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ నెల 25న కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీని కలుస్తామని ఆయన తెలిపారు.

సేఫ్టీ ఆఫీసర్ కావలెను

సేఫ్టీ ఆఫీసర్ :
ఫ్యాక్టరీల చట్టం 1948లోని సెక్షన్ 40(బి) మరియు AP ఫ్యాక్టరీస్ రూల్స్ 1950లోని 61(ఎ) ప్రకారం మేము మా ఫ్యాక్టరీ కోసం సేఫ్టీ ఆఫీసర్ పోస్ట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము.

అర్హతలు / అనుభవం :
1) డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆంధ్రప్రదేశ్ ద్వారా చట్టం ప్రకారం గుర్తించబడిన RLI / రాష్ట్ర టెక్నికల్ బోర్డు - AP నుండి ఇండస్ట్రియల్ సేఫ్టీ డిప్లమా.
2) ఏదైనా ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో గుర్తింపు పొందిన ఫుల్ టైం డిగ్రీ / డిప్లమా లేదా సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ మరియు సంబంధిత అనుభవం కలిగి ఉండాలి.
3) అభ్యర్థి తప్పనిసరిగా స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి

ఆసక్తి గల అభ్యర్థులు ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు కవరు పై భాగమున "సేఫ్టీ ఆఫీసర్ పోస్టు కోసం దరఖాస్తు" అని సూచిస్తూ దరఖాస్తు చేయవలెను.

ADITYA BIRLA GRASIM
హ్యూమన్ రిసోర్సెస్ విభాగము
గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - కెమికల్ డివిజన్
సర్వే 1-4, కనేడుమెట్ట, బలభద్రపురం గ్రామం, బిక్కవోలు మండలం.
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 533 343.
ఈ-మెయిల్ : recruitment.bbpuram@adityabirla.com